కానరాని శిలాఫలకం!

ప్రభుత్వం, పార్టీ ఏదైనా ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు చేపట్టే అభివృద్ధి పనులకు ఆనావాళ్లుగా శిలాఫలకాన్ని వేయడం సంప్రదాయంగా వస్తోంది. దశాబ్దాల తరబడి ప్రతీ అభివృద్ధి పనికి శిలాఫలకం వేయడం సహజం. ప్రజా ప్రతినిధులు ప్రోటోకాల్‌ను పాటిస్తూనే అభివృద్ధి పనులు తెలిసేలా శిలాఫలకాన్ని వేస్తారు. గత నాలుగేళ్లుగా అంబర్‌పేట్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయాలతో అభివృద్ధి పనులు ప్రారంభించినా శిలాఫలకం వేయకపోవడం గమనార్హం.



శిలాఫలకం లేకుండానే అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న దృశ్యం (ఫైల్)

- మొగ్గు చూపని ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం
- వేర్వేరు పార్టీల ప్రజా ప్రతినిధుల్లో సమన్వయ లోపం

అంబర్‌పేట్: నియోజక వర్గ పరిధిలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నా వాటి ఆనవాళ్లు, వివరాలు లేకుండా పోతున్నాయి. పనులకు సంబంధించిన బడ్జెట్ తదితర వివరాలు లేకుండా పోతున్నాయని పలువురు విస్మయానికి గురవుతున్నారు.

జవాబుదారీగా ...

అభివృద్ధి పనుల వివరాలు, పని పేరుతో పాటు వ్యయం, చేపట్టిన తేదీలు ఉండటంతో పూర్తి చేసిన పనుల నాణ్యత లోపించి 6 నెలల్లో ఏమైనా జరిగితే శిలాఫలకం సాక్షంగా నిలుస్తుంది. పనులు జరిగి ఆరు నెలలు గడవక ముందే మరమ్మత్తులకు గురైన సందర్భాలు చాలానే ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రజా ధనంతో చేపట్టే అభివృద్ధి పనులకు గుట్టు చప్పుడు కాకుండా చేపడుతున్న పరిస్థితులపై నియోజకవర్గంలో చర్చించుకుంటున్నట్లు సమాచారం.

రాజకీయ కోణమే..

- అంబర్‌పేటలో అభివృద్ధి పనులకు శిలాఫలకం వేయకపోవడంపై రాజకీయ కోణం కూడా ఉన్నట్లు పలువురు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. నియోజకవర్గంలో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల ప్రజా ప్రతినిధులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రోటోకాల్ ప్రకారం చిన్న పనిని ప్రారంభించినా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ల పేర్లను పొందుపరచాల్సి ఉంటుంది.
- రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన నిధులతో కేంద్ర మంత్రి పేరు ఉండటం కారణంగానే శిలాఫలకం ఏర్పాటు చేయడం లేదని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.
- మూడు డివిజన్లలో బీజేపీ కార్పొరేటర్లు ఉండటంతో వారి పేర్లు సైతం పొందుపర్చరనే ఉద్దేశంతో శిలాఫలకాలను ఏర్పాటు చేయడం లేదని నియోజకవర్గంలో బహిరంగ రహస్యంగా పేర్కొంటున్నారు.

కొత్త కార్పొరేటర్లు..

నియోజకవర్గంలో ఉన్న ఐదు డివిజన్‌లలో కాచిగూడ కార్పొరేటర్ మినహా మిగిలిన నలుగురు కొత్తగా ఎన్నికైనవారు కాగా.. వీరిలో ఇద్దరు బీజేపీ, ఇద్దరు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు ఉన్నారు. రాజకీయ కారణాలతో కొత్త కార్పొరేటర్లు తమ పేరుపై శిలాఫలకమే లేకపోవడంతో లోలోపల మదన పడుతున్నట్లు సమాచారం.

ప్రచారం ఇష్టం ఉండదు..



ప్రజలకు కనీసం మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా పని చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాను. శిలాఫలకంపై పేరు ఉండటం లేకపోవడ ం వంటి విషయాలను పట్టించుకోను. నియోజకవర్గంలో కోట్లాది రూపాయాలతో అభివృద్ధి పనులు చేపట్టాను. నేను చేసిన పనిని పెద్దగా చెప్పుకోవడం ఇష్టం ఉండదు.

– కాలేరు వెంకటేష్, ఎమ్మెల్యే అంబర్‌పేట్

ప్రోటోకాల్ కోసమే శిలాఫలకం వేయడం లేదు..



అభివృద్ధి పనులు ప్రారంభించే ముందు వాటికి సంబంధించిన వివరాలతో కూడిన శిలాఫలకం వేయడం ఆనవాయితీ. కేవలం ప్రోటోకాల్ కోసమే శిలాఫలకం వేయడం లేదు. ఇది రాజకీయంగా అభివృద్ధిపై మంచి సంస్కృతి కాదు. పెద్ద తరహా బడ్జెట్‌తో చేపట్టే అభివృద్ధి పనులకైనా శిలాఫలాకాలను ఏర్పాటు చేస్తే బాగుంటుంది. అభివృద్ధి పనులపై రాజకీయాల కారణాలు ప్రభావం చూపకూడదు.

– పద్మావెంకట్‌రెడ్డి, బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్

క్లుప్తంగా

విద్యార్థులకు పలకల పంపిణీ

అంబర్‌పేట: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అవసరాలపై మాజీ కార్పొరేటర్ పద్మావతి రెడ్డి స్పందించారు. శుక్రవారం గోల్నాక అంబేడ్కర్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పలకలు లేవని ఆమె దృష్టికి రావడంతో తక్షణమే స్పందించిన ఆమె వారికి కొత్త పలకలను పంపిణీ చేశారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి తన వంతు సహకారం ఎల్లవేళలా అందిస్తానని హామీ ఇచ్చారు.

దశలవారిగా అభివృద్ధి పనులు



అంబర్‌పేట: నియోజకవర్గంలో కాలం చెల్లిన పైప్‌లైన్ వ్యవస్థను దశలవారిగా ఆధునీకరించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఆయన బాగ్‌అంబర్‌పేట గజానంద్‌గడ్డ ప్రాంతంలో రూ.48 లక్షలతో చేపడుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. బీజేపీ నాయకులు వెంకట్‌రెడ్డి, కృష్ణాగౌడ్, జగన్, బీఆర్‌ఎస్ నాయకులు చందు, శ్రీరాములు ముదిరాజ్, రమేష్‌నాయక్ జలమండలి అధికారులు పాల్గొన్నారు.

అనాథలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



ముషీరాబాద్: అనాథ పిల్లలకు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయడంతో పాటు వారు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు త్వరగా పరిష్కరించాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ముషీరాబాద్‌లో ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎంఆర్పీఎస్ నాయకులు గండి కృష్ణ, గజ్జల రాజశేఖర్ తదితరులున్నారు.

రాష్ట్ర బీసీ మహాసభ ప్రధాన కార్యదర్శిగా ముత్యాల్‌రావు

కాచిగూడ: తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా మెట్టు ముత్యాల్‌రావును నియమిస్తూ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ శుక్రవారం నియామకపత్రాన్ని అందజేశారు. శుక్రవారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జనగణనలో బీసీ కులాల వారిగా కుల గణనను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పులిజాల కృష్ణ, భూషణ్ భాస్కర్, కిషోర్, ప్రదీప్‌గౌడ్, ప్రశాంత్ నిమ్‌కర్ తదితరులు పాల్గొన్నారు.

సేవాభావాన్ని అలవర్చుకోవాలి

ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని బీఆర్‌ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రావు అన్నారు. ఆలిండియా ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షులు గోవింద్, హైదరాబాద్ అధ్యక్షుడు చక్రం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోమ్‌లో రెబల్‌స్టార్, కేంద్రమాజీ మంత్రి దివంగత కృష్ణంరాజు జయంతి వేడుకలను నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు నర్సింగ్‌రావు, రవీందర్, బాబు, గోరేబాయ్, ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు హనుమంత్, అర్జున్, కౌశిక్, సాల్మన్, రాజశివ తదితరులున్నారు.

జిమ్ ట్రైనర్ ఆత్మహత్య

అంబర్‌పేట: ఓ జిమ్ ట్రైనర్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. డీఐ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పటేల్‌నగర్‌కు చెందిన వెంకటేష్‌గౌడ్ కుమారుడు రాకేష్‌గౌడ్(27) విద్యానగర్‌లో జిమ్‌ట్రైనర్. కాగా గతంలో ఓ అమ్మాయిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తడంతో భార్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి తీవ్ర మానసిక వేదనకు గురై ఈ నెల 12న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. దీంతో తల్లిదండ్రుల పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు మొదటగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. శుక్రవారం తిరిగొచ్చిన రాకేష్ ఇంట్లో ఎవరు లేని సమయంలో తాళం పగులగొట్టి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

కాచిగూడ: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందిన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కుద్బిగూడ ప్రాంతానికి చెందిన శరత్‌చంద్ర చందన దంపతుల కూమార్తె మానశ్రీ (2నెలలు) గురువారం ఇంట్లో మంచంపై నుంచి కింద పడింది. కూమార్తెకు పాలిచ్చి మంచంపై పడుకోబెట్టగా.. బెడ్‌పై నుంచి కింద పడటంతో గాయపడిన చిన్నారిని చికిత్స నిమిత్తం నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ. 10 కోట్లతో పార్కుల సుందరీకరణ పనులు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కాలేరు



కంటి వెలుగు కార్యక్రమంలో..

నల్లకుంట: నియోజక వర్గంలోని పార్కుల సుందరీకరణ పనులకోసం హెచ్‌ఎండీఏ నుంచి రూ. 10 కోట్లు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. దశల వారిగా అన్ని పార్కులను అభివృద్ధి చేస్తున్నామని ఆయన తెలిపారు. నల్లకుంట డివిజన్ టీఆర్టీ కాలనీలో మోత నాగేశ్వర్‌రావు పార్కులో రూ. 48.50 లక్షలతో చేపట్టే సుందరీకరణ పనులకు శుక్రవారం స్థానిక కార్పొరేటర్ అమృతతో కలిసి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం వాకింగ్ పాత్, టైల్స్ ఏర్పాటు, బెంచీల ఏర్పాటు, పార్కు చుట్టూ ప్రహరీ, ఆర్చ్ నిర్మాణం, పార్క్ చుట్టూ ఫెన్సింగ్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ నేత భూపతినాథ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిత్, హెచ్‌ఎండీఏ డీఈ దేవేందర్‌రెడ్డి, ఈఈ శంకర్, జీహెచ్‌ఎంసీ డీసీ వేణుగోపాల్, డీఈ సువర్ణ, ఏఈ దివ్య, జలమండలి ఏఈ రోహిత్, విద్యుత్‌శాఖ ఏఈ సౌమ్య, ఏంహెచ్‌ఓ జ్యోతిబాయి, హార్టికల్చర్ డీఈ పేరిరాజు, మేనేజర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

- నర్సింహ బస్తీలోని బస్తీ దవాఖానలో ఎమ్మెల్యే కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ప్రజలు సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు.



ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామారపు శ్రీనివాస్‌మాదిగ తదితరులు

వినతిపత్రం అందజేత

కాచిగూడ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధతకు చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి ఒప్పించాలని కోరుతూ.. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గ్రేటర్ హైదరాబాద్ ఇన్‌చార్జ్ రామారపు శ్రీనివాస్‌మాదిగ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం శుక్ర వారం బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావును బీజేపీ బర్కత్‌పురా నగర కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కేంద్రంలో గత 8 ఏళ్లకు పైగా అధికారంలో ఉండి కూడా బీజేపీ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో జాప్యం జరుగుతుండటంతో మాదిగలు తీవ్ర ఆవేదన చెందుతున్నారన్నారు. ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్‌మాదిగ, జాతీయ ఉపాధ్యక్షుడు విజయమాదిగ, మహాజన సోషలిస్టు పార్టీ నేతలు యాదయ్య, బాలక్రిష్ణ, రాజశేఖర్, యామిని, రశ్మిత , రమేష్ తదితరులు పాల్గొన్నారు.

‘పాడి పరిశ్రమ అభివృద్ధికి కేంద్రం విశేష కృషి’



పశు సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

కాచిగూడ: దేశంలో పాడిపరిశ్రమ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కాచిగూడలోని ఘన్‌శ్యామ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని బీఎఫ్‌ఐఎల్ సంజీవని పశు సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. పాడి పరిశ్రమను ప్రోత్సహించడం కోసం ప్రత్యేకంగా కేంద్రంలో డెయిరీ డెవలప్‌మెంట్ శాఖను ఏర్పాటు చేశామన్నారు.

- పశు సంతతిని పెంచాలనే ఉద్దేశంతో ప్రత్యేక పథకాలను చేపట్టి ప్రోత్సహించడం జరుగుతుందని పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వారికి కేంద్ర ప్రభుత్వం చేయూతను అందిస్తుందన్నారు.
- సరైన ఆహారం, వైద్యం అందక పశువులు చనిపోవడం బాధ కలిగించిందని పశువులకు ఇంటి వద్దనే వైద్యం అందించి వాటి ప్రాణాలను కాపాడడానికి బీఎఫ్‌ఐఎల్ సంజీవని పశు సేవా కేంద్రాన్ని ప్రారంభించినట్లు కేంద్రమంత్రి తెలిపారు.
- సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పశుపోషకులు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
- పాల ఉత్పత్తిదారులకు ప్రయోజనకరంగా ఉండేలా ఈ సేవా కేంద్రం నిరంతరాయంగా పనిచేస్తోందన్నారు.
- రోగాల బారినపడే పశువులకు వైద్యంతో పాటు ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. పాల ఉత్పత్తిదారులు, గోశాల నిర్వాహకులు ఈ ఉచిత వైద్య సేవలను పొంది తమ పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.
- పశువులకు వైద్య సేవలు పొందడానికి టోల్ ఫ్రీ నెంబర్లు 18001032019, 18005992016ను కేటాయించినట్లు తెలిపారు. బీజేపీ రాజ్యసభ సభ్యులు కె. లక్ష్మణ్, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, వెంకట్‌రెడ్డి, చింతల రాంచంద్రారెడ్డి, పాండుయాదవ్, నందకిషోర్ యాదవ్, వినోద్‌యాదవ్, గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్‌అగర్వాల్, కార్పొరేటర్లు కన్నె ఉమారమేష్‌యాదవ్, అమృత, పావనివినయ్‌కుమార్, మహాలక్ష్మీరామన్‌గౌడ్, దీపిక, శంకర్‌యాదవ్, బీఎఫ్‌ఐఎల్ ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

కల్లుగీత వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కల్లుగీత వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజుగౌడ్, కన్వీనర్ వెంకన్నగౌడ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ కమిషనర్ సర్ఫరాజు అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. గీతా కార్మికుల ఎక్స్‌గ్రేషియోకు అడ్డంకిగా ఉన్న మెడికల్ బోర్డును తక్షణమే రద్దు చేయాలన్నారు. పలు కారణాలతో రద్దు చేసిన టీసీఎస్, టీఎఫ్‌టీలను పునరుద్ధరించాలని కోరినట్లు సమాచారం.

- రాష్ట్రంలో 2,18000ల మంది గీతా వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. 4305 టీసీఎస్‌లు, 379 టీఎస్‌టీలు ఉన్నాయని వీటిలో కల్లుగీత వృత్తి సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.
- గీతాకార్మికులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియో, రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. వైన్స్, బార్‌లలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. సమన్వయ కమిటీ వర్కింగ్ చైర్మన్ విజయ్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్, గౌడ సంఘం ఉపాధ్యక్షుడు ఐలేనిగౌడ్ పాల్గొన్నారు.

సామాజిక ఉద్యమాలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న గోరేటి వెంకన్న

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సామాజిక ఉద్యమ స్ఫూర్తి ప్రదాతలు మార్క్స్, అంబేడ్కర్ స్ఫూర్తితో సామాజిక ఉద్యమాలను బలోపేతం చేయాలని ఎమ్మెల్సీ, ప్రజా వాగ్గేయకారుడు గోరేటి వెంకన్న పిలుపునిచ్చారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ డైరీని ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ చరిత్ర గతిని మార్చిన మార్క్స్ జీవిత లక్ష్యమైన దోపిడీలేని సమాజం, కుల వివక్షతను రూపుమాపడానికి తన సర్వస్వం త్యాగం చేసిన అంబేడ్కర్ మార్గదర్శకంలో సామాజిక ఉద్యమాలు ముందుకు సాగాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, కేవీపీఎస్ అధ్యక్షుడు జాన్‌వెస్లీ, టీపీఎస్‌కె కార్యదర్శి రాములు, బిక్షమయ్య, విజయ్‌కుమార్, నర్సింగరావు, నాగార్జున తదితరులున్నారు.

పీఆర్‌టీయూ చొరవతోనే చైల్డ్ కేర్ సెలవులు

ముషీరాబాద్: పీఆర్‌టీయూ టీఎస్ చొరవతోనే మహిళా ఉపాధ్యాయులకు చైల్డ్ కేర్ లీవ్, సకల జనుల సమ్మె సెలవులు వచ్చాయని పీఆర్‌టీయూ టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ముషీరాబాద్, హిమాయత్‌నగర్, నల్లకుంట, జామైఉస్మానియా, మాణికేశ్వర్‌నగర్, సీతాఫల్‌మండి, కవాడిగూడ, ముషీరాబాద్ తదితర ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, నాయకులు ప్రశాంత్‌రెడ్డి, అశోక్, రమేష్, రవి, అంజయ్య, అనిల్‌కుమార్‌రెడ్డి, నటరాజా, మందడి వెంకట్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రాజేంద్రప్రసాద్, పాల్వాయి వెంకట్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రాఘవేందర్ తదితరులున్నారు.

ప్రత్యేక పూజలు



నల్లకుంట: మూలా నక్షత్రం సందర్భంగా నల్లకుంటలోని సీతారామాంజనేయ, సరస్వతి దేవాలయం భక్తులతో పోటెత్తింది. శుక్రవారం ఉదయం అర్చకులు అమ్మవారికి విశేష పూజలతో పాటు కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో మంత్రోచ్చరణల మధ్య చండీ హోమం నిర్వహించి అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

‘కంటివెలుగుకు అనూహ్య స్పందన’



వైద్య సిబ్బందితో డాక్టర్ మాధవి తదితరులు.



ఎమ్మెల్యే ముఠా గోపాల్, వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని క్యాంపు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవి అన్నారు. కాచిగూడ డివిజన్, విక్రమ్‌నగర్ పార్కు వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరానికి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కంటి వెలుగు శిబిరంలో పరీక్షలు చేయించుకుని తమ కళ్లను రక్షించుకోవాలని సూచించారు. శుక్రవారం ఒక్క రోజూ 130 మందికి పైగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. వైద్య సిబ్బంది రాజు, అఫ్రీన్ సుల్తానా, ఎఎన్ఎం సునిత, పద్మ, సుహాసిని, సూపర్‌వైజర్ నర్సుబాయి, ఆశావర్కర్లు ఉమాదేవి, పుష్పవతి, మాధవి, లావణ్య తదితరులున్నారు.

కంటివెలుగు పేదలకు వరం..

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకం పేదలకు వరమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ముషీరాబాద్ డివిజన్ మోహన్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ఎమ్మెల్యే ముఠాగోపాల్, భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. బీఆర్‌ఎస్ నగర నాయకుడు ముఠా జైసింహా, ముషీరాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్ రెడ్డి, పూస గోరఖ్‌నాథ్, ఎయిర్‌టెల్ రాజు, శోభ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానం అందజేత



కాచిగూడ: భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణోత్సవాన్ని వీరభద్ర స్వామి సేవా సమితి సభ్యులు స్వచ్ఛందంగా నిర్వహించడం అభినందనీయమని ప్రముఖ వ్యాపారస్తుడు ప్రభాకర్ అన్నారు. షాబాద్ వెంకటేశం, కాసుల వినోద్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం శుక్రవారం ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల సహకారంతో కల్యాణ మహోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు సేవా సమితి ప్రధాన కార్యదర్శి కాసుల వినోద్ తెలిపారు. కైలాష్ నాగేష్, వినోద్ కుమార్, కరుణ, హరిబాబు, విజయ్‌పటేల్, ఆనంద్, నాగేష్, మల్లికార్జున్ తదితరులున్నారు.

ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో సౌకర్యాలకు కృషి



మాట్లాడుతున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సహకారంతో డివిజన్ పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తున్నానని నల్లకుంట కార్పొరేటర్ అమృత అన్నారు. ఆయన చొరవతోనే న్యూ నల్లకుంటలోని శ్రీరామ ఎడ్యుకేషనల్ సొసైటీ పాఠశాలకు వాష్‌రూమ్‌లను శుభ్రం చేసే పరికరాలను మంజూరు చేయించారు. శుక్రవారం పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి, హెచ్‌ఎం సునీతలకు క్లీనింగ్ మిషన్‌ను అందజేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, ఓబీసీ మోర్చా కార్యదర్శి కిశోర్‌కుమార్, బీజేపీ సెంట్రల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కేజే బాబు, అంబర్‌పేట్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ మధుయాదవ్, నల్లకుంట డివిజన్ ప్రధాన కార్యదర్శి సురేష్‌యాదవ్, నాయకులు శ్యామ్‌రాజ్, ఇర్ఫాన్ సుల్తానా, శ్రీనివాస్, ధర్మేందర్ తదితరులున్నారు.

కంపెనీ అభివృద్ధికి కృషి చేయాలి




ప్రమాణ స్వీకారం చేసిన నూతన కమిటీ సభ్యులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వీఎస్‌టీ కార్మికుల సంక్షేమం, కంపెనీ అభివృద్ధి కోసం నూతన యూనియన్ కమిటీ సభ్యులంతా కృషి చేయాలని వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్‌టీ యూనియన్ కార్యాలయంలో నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. వీఎస్‌టీ కార్మికులకు వచ్చే ఆగస్టు నెల నుంచి అమలు జరిగే నూతన వేతన సవరణలో మంచి వేతనాలు పెరిగేలా తమవంతుగా కృషిచేస్తామన్నారు. దివంగత కార్మిక నేత నాయిని నర్సింహారెడ్డి ఆశయ సాధన కోసం వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ పనిచేస్తుందన్నారు.

నూతన కార్యవర్గం..


యూనియన్ ప్రధాన కార్యదర్శిగా అయిలి ప్రభాకర్, కోశాధికారిగా నరేందర్‌గౌడ్, చీఫ్ ఉపాధ్యక్షుడిగా హరీసాల్వేస్టన్, ఉపాధ్యక్షుడిగా రాజేందర్‌రెడ్డి, రాములు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా రవిందర్ యాదవ్, అసిస్టెంట్ ప్రధాన కార్యదర్శులుగా మధుసూదన్, వెంకట్రామిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా మహ్మద్ తారీస్, సహ కార్యదర్శిగా శంకర్, ప్రచార కార్యదర్శిగా మల్లేష్, సహ ప్రచార కార్యదర్శిగా సత్యనారాయణలు ప్రమాణ స్వీకారం చేశారు. నాయిని దేవేందర్ రెడ్డిలతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

నిరంతరం విద్యుత్‌ను అందిస్తున్నాం



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ ఏర్పడిన 8 ఏళ్ల నుంచి నిరంతరం విద్యుత్ సరఫరాను అందిస్తున్నామని తెలంగాణ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రావు అన్నారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో విద్యుత్ కార్మిక డైరీ 2023ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కొత్తగూడెం థర్మల్‌పవర్ (కేటీపీఎస్) రాష్ట్రానికే తలమానికంగా ఉందని కేసీఆర్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం ఎంతగానో కృషిచేస్తోందని కొనియాడారు. డాక్టర్ జీఎస్ఆర్ ట్రస్ట్ పేరిట విద్య, ఉపాధి, ఆరోగ్య సదుపాయాలను కల్పిస్తోందని ఇప్పటికే 2700ల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. విద్యుత్ కార్మిక సంఘం అధ్యక్షులు ఖాజా మొయినుద్దీన్, ప్రధాన కార్యదర్శి కేవీ రామారావు, అదనపు ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసాచారి, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అనాథల సమస్యల పరిష్కారానికి రాజకీయ పోరాటం



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాష్ట్రంలో అనాథల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం సిఫార్సులను వెంటనే అమలు చేయాలని లేదంటే అన్ని రాజకీయ పార్టీలను ఏకం చేసి రాజకీయ పోరాటానికి సిద్ధం కానున్నట్లు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు. విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో అనాథలకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అనాథల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. ఆయన ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకట్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో అనాథ హక్కుల పోరాట వేదిక ఆవిర్భావం జరిగింది. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అనాథలు ఎంత జనాభా ఉన్నారనే విషయాన్ని తేల్చేందుకు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేయాలన్నారు. 2015లో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినట్టుగా రాష్ట్ర వ్యాప్తంగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలతో ఈ నెల 23న రౌండ్‌టేబుల్ సమావేశం, 30న ఇందిరాపార్కు వద్ద మహాదీక్ష చేపట్టనున్నట్లు ప్రకటించారు.

నూతన కమిటీ..

అనాథ హక్కుల పోరాట వేదికకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మందకృష్ణమాదిగ, సలహాదారులుగా వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడిగా వెంకటయ్య, కార్యదర్శిగా కృష్ణవేణి, రాజు, కార్యవర్గ సభ్యులుగా శిరీష, గంగోత్రి తదితరులు ఎన్నికయ్యారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు గజ్జల రాజశేఖర్, ప్రొఫెసర్ శంకర్, తిప్పారపు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383